దివ్యాంగులకు అండగా మంగళగిరి రోటరీ క్లబ్

- 127 మందికి శ్రీపాదం పేరుతో కృత్రిమ కాళ్లు పంపిణీ
- రోటరీ క్లబ్ సేవలను అభినందించిన లబ్ధిదారులు

మంగళగిరి, మంగళగిరి టౌన్: పలు రకాల ప్రమాదాలలో కాళ్లు, చేతులను కోల్పోయిన దివ్యాంగులకు మంగళగిరి రోటరీ క్లబ్ అండగా నిలుస్తుంది. కోట్ల రూపాయలను వెచ్చించి కృత్రిమ కాళ్లు, చేతులను పంపిణీ చేసి పేద దివ్యాంగులకు అండగా నిలుస్తున్న మంగళగిరి రోటరీ క్లబ్ ఎన్నో ప్రశంసలు అందుకుంటోంది. పట్టణంలోని వీటీజేఎమ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో 127 మందికి శుక్రవారం రూ.24 లక్షల ఖర్చుతో కృత్రిమ కాళ్లను నిర్వాహకులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లిహిల్స్‌ల ఆధ్వర్యంలో శ్రీపాదం పేరుతో 127 మంది దివ్యాంగులకు ప్రభా ఫుట్ కృత్రిమ కాళ్లను పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. రూ.24 లక్షల వ్యయంలో బీజీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ కంపెనీ రూ.12 లక్షలు ఆర్థిక సహాయం అందించింది. 2024 సంవత్సరంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.3 కోట్లు వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా చేతులు లేని దివ్యాంగులకు కృత్రిమ చేతులు(జేమ్ ఎంకే1)ని పంపిణీ చేశారు. 251 మంది దివ్యాంగులకు ది హ్యాండ్ ప్రాజక్టు జర్మనీ, ఆసిస్ట్ చిలకలూరిపేట, మంగళగిరి రోటరీ కరవాలంబన ట్రస్ట్‌ల సౌజన్యంతో పంపిణీ చేశారు.



కృత్రిమ కాళ్ల లబ్ధిదారులతో నిర్వాహకులు



కృత్రిమ చేతులను పరిశీలిస్తున్న నిర్వాహకులు

నగరంలోనూ పలు సేవా కార్యక్రమాలు..

రోటరీ క్లబ్ నిర్వాహకులు నగరంలోని పలుచోట్ల తాగునీరు అందించడంతో పాటు లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శిశుస్థన్యపాన కేంద్రం, చినకాకాని జెడ్పీ స్కూలులో కెరీర్ గైడెన్స్, పశు వైద్యశాలలో శిథిలమైన ప్రహరీ గోడ నిర్మాణం, మహిళలకు టాయిలెట్లు, పశు వైద్యశాల పునరుద్ధరణ చేయించి ఎంతో మంది పాడి రైతులు వినియోగించుకునేలా చేశారు. మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, పేద కుటుంబాలను ఆదుకునేందుకు నిత్యావసర సరుకులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో బ్లడ్ బ్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇలా పేదలకు అనేక రకాల సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రోటరీ క్లబ్ ప్రతినిధులు ఇసునూరి అనిల్ చక్రవర్తి, అందే మురళీ మోహన్, గాజుల శ్రీనివాసరావులు తెలిపారు.

జీవితంలో మరువలేము..



మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ చేతులు పెట్టిస్తుందని తెలిసి వచ్చాను. రూపాయి ఖర్చు లేకుండా కృత్రిమ చేయి పెట్టించారు. మాలాంటి పేద దివ్యాంగులకు మంగళగిరి రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను జీవితంలో మరువలేము. ఎంతో ఖర్చుతో కూడుకున్నది కావడంతో మాలాంటి పేదలు భరించలేము.

– సగరం బాల వెంకటసుబ్రమణ్యం, ఏలూరు

సేవలు అభినందనీయం..



రోటరీ క్లబ్ ద్వారా కృత్రిమ కాలు పొందడం ఆనందంగా ఉంది. మాలాంటి దివ్యాంగులకు అండగా నిలుస్తున్న రోటరీ క్లబ్ వారికి ధన్యవాదాలు. మాలాంటి పేదలు ఇలాంటి కృత్రిమ కాలు వేయించుకోవాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. ఆ ఖర్చు భరించలేక ఇంతకాలం కాలు పెట్టించుకోలేకపోయాము. రోటరీ క్లబ్ అండతో కృత్రిమ కాలు వేయించడంతో నడవగలమనే నమ్మకం కలిగింది. మంగళగిరి రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయం.

– యజ్జారపు లక్ష్మీనారాయణ, బొర్రపాలెం

ఖర్చుతో కూడుకున్న పని..



రోటరీ క్లబ్ సహకారంతో కృత్రిమ కాలు పెట్టించారు. మంగళగిరి రోటరీ క్లబ్ కృత్రిమ కాళ్లు అందిస్తుందని తెలిసి వచ్చి సద్వినియోగం చేసుకున్నాను. మాలాంటి పేద దివ్యాంగులకు మంగళగిరి రోటరీ క్లబ్ అండగా నిలవడం అభినందనీయం. కృత్రిమ కాలు పెట్టించుకోవాలంటే ఎంతో ఖర్చుతో కూడిన పని. మాలాంటి వారు అంత ఖర్చు భరించలేము.

– పెరుమాళ్ల నాగలక్ష్మి, అన్నవారి గూడెం, ఏలూరు జిల్లా

క్లుప్తంగా

ఫ్లోరోసిస్‌పై ప్రజలకు అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బేతపూడిలో శుక్రవారం జాతీయ ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ గిరిధర్ కుమార్ హాజరై ఫ్లోరోసిస్ నివారణ, తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ఫ్లోరోసిస్ బోరు నీరు, పొగాకు, బ్లాక్‌సాల్ట్ ద్వారా వస్తుందని.. వాటిని ఎక్కువగా తీసుకోకూడదని చెప్పారు. వ్యాధి రాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకునేలా ఆరోగ్య సిబ్బంది వారికి అవగాహన కల్పించాలన్నారు.

నూతన ఎంపీడీవోగా శివ సుబ్రహ్మణ్యం



ఫిరంగిపురం: మండల ఎంపీడీవోగా పూషాడపు శివ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా చీరాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. పలువురు సిబ్బంది ఎంపీడీవోకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవికుమార్, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, జేఏ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్: భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో భవన నిర్మాణ కార్మికులతో సమావేశాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. జూలై 24, 25 తేదీల్లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం మరిచారా.. విడిచారా!



మంగళగిరి టౌన్: వారం రోజులుగా ఒకే చోట ఉన్న వాహనం స్థానికుల్లో కలకలం రేపుతోంది. ఆ ద్విచక్రవాహనం ఎవరిది.. ఎవరు పార్క్ చేశారో తెలియడం లేదు. కానీ వారం రోజులుగా తాడేపల్లి క్రిస్టియన్ పేట చర్చికి సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంది. వాహనం ఏపీ07ఈఎఫ్5395 నంబరు గల ఆ వాహనం వారం రోజులుగా అక్కడే ఉండడంతో ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ వాహనాన్ని ఇక్కడ మరిచారా.. లేక విడిచి వెళ్లారా.. లేదా ఏదైనా నేరం చేసి ఇక్కడ వదిలి వెళ్లారా అని స్థానికుల్లో చర్చనీయాంశం అయ్యింది.

చెస్ కోచ్ నిరంజన్ సేవలు అభినందనీయం



తెనాలిటౌన్: సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ డైరెక్టర్, కోచ్ ఎం.నిరంజన్ సేవలు అభినందనీయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మారీసుపేటలోని చెస్ అకాడమి కార్యాలయంలో ఇంటర్నేషనల్ ప్లేయర్, కోచ్ ఎం.నిరంజన్‌ను ఘనంగా సత్కరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు పాల్గొని దుశ్శాలువా, మెమొంటోతో సత్కరించి అభినందనలు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా అనేక మంది విద్యార్థులకు చెస్ కోచింగ్ ఇవ్వడమేకాక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వారు రాణించేలా కృషి చేసిన నిరంజన్ సేవలను ప్రసంశించారు. కార్యక్రమంలో చావాలి అకుల్‌నాథ్, చావాలి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

యోగాంధ్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తెనాలిటౌన్: పట్టణంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు పట్టణంలో నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాలు వివిధ కేంద్రాల్లో నిరాటకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, నూతన ప్లే గ్రౌండ్స్, సచివాలయ కమ్యూనిటీ హాల్స్, కల్యాణ మండపాలలో ఉదయం 7గంటల నుండి 9 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా యోగా శిబిరాలు జరుగుతున్నట్లు వెల్లడించారు.

కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు

మంగళగిరి టౌన్: దళితులు రోడ్డుపై నడిస్తే మైల పేరుతో పసుపు నీళ్లు చల్లడంతో పాటు కులం పేరుతో దూషిస్తూ వేధిస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గతనెల 24వ తేదీన బాధితురాలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఘటనపై ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట దళిత సంఘాల నాయకుల సహకారంతో ఆందోళన చేపట్టారు. దూషించిన మహిళ భర్త కేంద్ర పాలక పార్టీ పట్టణ అధ్యక్షులు కావడంతో కేసు నమోదు చేయలేదని బాధితురాలు వాపోయింది. స్థానికుల వివరాల ప్రకారం.. మంగళగిరి కొప్పురావు కాలనీలో పగడపు రాధా, వెంకటేశ్వరరావులు పాతికేళ్లుగా జీవనం సాగిస్తున్నారు. వీరి నివాసానికి ఎదురుగా ఉండే మునగాల ప్రీతి, నాగేశ్వరరావులు రాధా, వారి మనువళ్లను కులం పేరుతో దూషించడంతో పాటు పైకి చెప్పలేని మాటలు అంటున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై దళిత నాయకులు కులం పేరుతో దూషించిన మహిళపై కేసు నమోదు చేయాలని డీఎస్పీ మురళీకృష్ణను డిమాండ్ చేశారు. స్పందించిన డీఎస్పీ బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలని పట్టణ పోలీసులను ఆదేశించారు. ఈ ధర్నాలో ఎమ్మార్పీఎస్ నాయకులు చందోలు విక్టర్ పాల్, కలకోటి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంతేటి సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ నియామకం



దుగ్గిరాల: జూలై 7వ తేదీన ఒంగోలులో జరగనున్న 31వ ఆవిర్భావ సభని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉరుసుపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం మంగళగిరి పెన్షనర్స్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒంగోలు జరగనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన తెలిపారు. సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం రాష్ట్ర కమిటీలను ఆయన ప్రకటించారు. ఈపూరి ఆదాం, పులిదాసు, కట్టేపోగు బాబురావు, సాంబయ్యలను నియమించారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కమలాకర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్ పై అవగాహన

కొల్లిపర: స్వయం సహాయ సంఘాలకు చెందిన ఎటువంటి లావాదేవీలు ఇకనుండి మొబైల్ బుక్ కీపింగ్ యాప్ ద్వారా ఆన్లైన్ లో ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చని ఐబీ డీపీఎం బి.కామేశ్వరి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో స్వయం సహాయ సంఘాలకు మొబైల్ బుక్ కీపింగ్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఐదు గ్రామ సంఘాలు ప్రభుత్వం ఎంపిక చేసి పైలెట్ గా ఈ యాప్ ను ఆయా గ్రామాలలోనే స్వయం సహాయ సంఘాలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యాప్ ద్వారా స్వయం సహాయ సంఘాలు జరుపుతున్న లావాదేవీలు ఎప్పటికప్పుడు ఏ విధంగా పరిశీలించాలి అన్న అంశాలను వివరించారు. ఏపీఎం పి.రమాదేవి, సీసీలు టి.మధు, పూర్ణయ్య నాగుల్ ఖాన్, వెంకటరత్నం, వివో ఎస్.సుధారాణి, ప్రవంతి, బసమ్మ, సునీత, స్వాతి, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మంగళగిరి టౌన్: మంగళగిరి, తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మంగళగిరి విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని కేకే టవర్స్, ఎస్ఎల్వీ అపార్ట్‌మెంట్ ప్రాంతం, ఎన్ఎస్ఆర్ విల్లాస్ రోడ్, కొండపనేని టౌన్‌షిప్, రత్నాలచెరువు.. రూరల్ పరిధిలోని నవులూరు శివాలయం ఏరియా, పుట్ట రోడ్డు, ఉడా కాలనీ, బాపూజీ నగర్, శిబిరం, చినకాకాని, ఆత్మకూరు, కాజా, పెదవడ్లపూడి, కొత్తపాలెం.. తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి, కృష్ణనగర్, పట్టణ పరిధిలోని జీటీ రోడ్, ఎమ్మార్వో కార్యాలయం, ముగ్గురోడ్డు, పోలకంపాడు, అద్దేపల్లి వారి వీధి, సాయినగర్, ఉండవల్లి సెంటర్, సీతానగరం, కేఎల్ రావు కాలనీ, బ్రహ్మానందపురం, కొలనుకొండ, వడ్డేశ్వరం, మదర్ థెరిస్సా కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ఫిరంగిపురం: మండల పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలోని 3 సబ్ స్టేషన్లలో దుగ్గిరాల, చిలువూరు, పెదపాలెం పరిధిలోని గ్రామాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఏఈ వసంతరావు తెలిపారు. మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. ప్రజలు సహకరించాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్లతో సామాన్యుడికి ఆర్థిక భారం

సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్

తెనాలిటౌన్: విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడంతో సామాన్యులకు ఆర్థిక షాక్ తగులుతుందని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పేదల ఇళ్ళకు బిగిస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ప్రజలపై మోపుతున్న ఇంటి పన్నుల భారాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ పాల్గొని ప్రజలకు కరపత్రాలు అందజేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు భవిష్యత్‌లో మనపాలిట శాపాలుగా మారుతాయని ఆరోపించారు. ఉపాధి లేక సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే సాంకేతికత పేరుతో కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లు బిగిస్తుందని మండిపడ్డారు. కష్టాల నుంచి ప్రజలను గట్టెంకిచాల్సిన ప్రభుత్వం ఆస్తి ఆధారిత పన్ను వసూలు చేయడం సరైన విధానం కాదని విమర్శించారు. రాజకీయ విలువలు పాటించకపోతే రాబోయే రోజుల్లో ప్రజా ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురికాకతప్పదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్‌వలీ, ఎస్.రాజ్యలక్ష్మి ఉన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బాబుప్రసాద్

దొరికిన పర్సు పోలీసులకు అప్పజెప్పిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

తెనాలిరూరల్: రోడ్డుపై పడి ఉన్న పర్సును సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పోలీసులకు అప్పగించాడు. మండలంలోని చావావారిపాలెంకు చెందిన చిక్కాల తరుణ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల వర్క్ ఫ్రం హోం కింద స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం రాత్రి బైక్‌పై తెనాలి వచ్చిన అతను రైల్వే స్టేషన్ రోడ్డులోని పెట్రోలు బంకులో పెట్రోల్ కొట్టించుకుని దాని ఎదురు రోడ్డులోకి వెళ్లగా రోడ్డుపై పర్సు పడి ఉండడాన్ని గమనించాడు. పర్సులో నగదు, ఏటీఎం కార్డులు, ఆధార్ కార్డు ఉంది. చుట్టపక్కల వాళ్లను వాకబు చేసిన ఎవరి పర్సు పోలేదని చెప్పగా, వెంటనే సమాచారాన్ని తెనాలి ట్రాఫిక్ విభాగంతో హోంగార్డుగా పని చేస్తున్న తన తండ్రి సింగ్‌కు తెలిపాడు. ఆయన సూచన మేరకు ఇరువురూ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ నక్కా ప్రకాశరావుకు పర్సును అందజేశారు. నిజాయితీగా పర్సును అందజేసిన తరుణ్‌ను ఎస్ఐ, త్రీ టౌన్ సిబ్బంది అభినందించారు.



ఎస్ఐ ప్రకాశరావుకు పర్సును అందజేస్తున్న తరుణ్, హోంగార్డు సింగ్

బీసీ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి

తెనాలి: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాల విద్యార్థులు, ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలంటూ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు నేతృత్వంలోని బృందం శుక్రవారం సీఎం కార్యాలయ కార్యదర్శికి విజ్ఞాపన అందించారు. ఏసీబీ కేసులను 6 నెలల్లో పరిష్కరించాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

తెనాలిటౌన్: మండల పరిషత్ ఉద్యోగుల సేవార్థం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పటల్ తెనాలి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, విద్యాశాఖ కార్యాలయం, వెలుగు కార్యాలయ పరిధిలోని ఉద్యోగులు ఈ శిబిరంలో పాల్గొన్ని వైద్య సేవలు పొందారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యోగులు సేవార్థం అగర్వాల్స్ ఐ హాస్పటల్ యాజమాన్యం వైద్య శిబిరం నిర్వహించడం ముదావహమని సేవలను కొనియాడారు. ఉద్యోగులకు అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌ఛార్జి ఎస్‌కె నాగూర్‌వలి, ఎంఈవో ఎం.లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంపీడీవో అత్తోట దీప్తి

ఎల్‌వోసీ చెక్కులు పంపిణీ

పెదవడ్లపూడి(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడిలో శుక్రవారం అనారోగ్య బాధితులకు ఎల్‌వోసీ చెక్కులను పంపిణీ చేశారు. బాధితులు షేక్ బాషాకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.07 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) చెక్కును టీడీపీ నాయకులు జువ్వాది కిరణ్ చందు, శివరామయ్య, చిట్టిబొమ్మ కృష్ణారావు తదితరులు అందజేశారు.

మండలంలో 28.8 మి.మీ వర్షం

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మండలంలో 28.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యిందని దుగ్గిరాల తాహసీల్దార్ కార్యాలయం నుంచి అధికారులు వర్షమాపిని ద్వారా నమోదైన వివరాలను వెల్లడించారు.

ట్రై సైకిల్ అందజేత



మంగళగిరి టౌన్: నడవలేని ఓ చిన్నారికి ట్రై సైకిల్‌ను తాడేపల్లి డీఈవో శాంతకుమారి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఉండవల్లి ఎంపీయూపీ పాఠశాలలో చదువుతున్న ఖాజా ఫక్రుద్దీన్ అనే బాలుడు నడవలేని స్థితిలో ఉండడంతో సమగ్ర శిక్షా ద్వారా బ్యాటరీ ట్రై సైకిల్‌ను ఫక్రుదీన్ తల్లిదండ్రులకు అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవోడీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు హరికృష్ణ, సునీత కుమారి తదితరులు పాల్గొన్నారు

డ్రైవర్ కుటుంబానికి చేయూత

మంగళగిరి, మంగళగిరి టౌన్: తన వద్ద పనిచేసే డ్రైవర్ మృతి చెందడంతో ఆ కుటుంబానికి చేయూతనిచ్చి ఆర్థిక సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులో అండగా ఉంటానని రాష్ట్ర సమాచార కమిషనర్ డాక్టర్ చావలి సునీల్ భరోసా ఇచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం డ్రైవర్ తల్లిదండ్రులకు రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. తన వద్ద కొంతకాలంగా డ్రైవర్‌గా పనిచేస్తున్న ప్రకాష్(22) కొద్ది రోజుల క్రితం తల్లిదండ్రులు నివాసముంటున్న ఏలూరుకు వెళ్లారు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ ప్రకాష్ మృతి చెందారు. దీంతో కుటుంబానికి అండగా ఉన్న ప్రకాష్ మృతి చెందడంతో ఆ కుటుంబానికి తాను అండగా ఉంటానని సునీల్ హామీ ఇచ్చారు. వాహనంపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాదంలో ప్రకాష్ మృతి చెందారని.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ ఘటనను దృష్టిలో పెట్టుకుని హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహన దారులకు హెల్మెట్లు ఉచితంగా అందజేశారు.



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న సునీల్

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు

తెనాలిటౌన్: పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు ఇన్‌ఛార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. శుక్రవారం పట్టణ కొత్తపేట, గంగానమ్మపేటలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కొత్తపేటలో శానిటేషన్ సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం వార్డులో పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.కాల్వల్లో షీల్ట్ తీయడం వేగవంతం చేయాలని ఎక్కడ అపరిశుభ్రత కనపడకూడదని సూచించారు. అనంతరం గంగానమ్మపేటలో పర్యటించి తడి చెత్త పొడి చెత్త సేకరణను పరిశీలించారు. గృహిణులు రోడ్లపై చెత్త చెదారం వేయవద్దని ముఖ్యంగా కాల్వల్లో వ్యర్థాలు పడవేయవద్దని సూచించారు. చెత్త సేకరణకు ఇంటికి వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్త ఇవ్వాలని కోరారు. ఆయన వెంట శానిటేషన్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

తెనాలిరూరల్: గంటూరు నుండి గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రూరల్ సీఐ ఆర్. ఉమేష్ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. పట్టణ ఐతానగర్‌కు చెందిన సుకుమార్ మండలంలోని సోమసుందరపాలెంకు చెందిన అలికిపల్లి సాంబిరెడ్డి, కొల్లిపర మండలం తూములూరుకు చెందిన కురగంటి చైతన్య, పెదరావూరుకు చెందిన పగడం మణిసింహారెడ్డి స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు డబ్బుల కోసం గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. గంటూరు కొత్తపేటకు చెందిన వృద్ధుడు రత్తయ్య వద్ద కొనుగోలు చేసి తీసుకువచ్చి పొట్లాలు కట్టి విక్రయిస్తున్నారు. గంజాయి విక్రయాలపై సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐలు ఆనంద్, శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ చెంగలరాయుడు, కానిస్టేబుళ్లు డి. రవి, సుబ్బారెడ్డి నందివెలుగు ప్రధాన కూడలిలో గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై సాంబిరెడ్డి, చైతన్య, మణిసింహారెడ్డి త్రిపుల్ రైడింగ్ చేస్తూ కనబడ్డారు. వారి వాహనాన్ని తనిఖీ చేయగా 1400 గ్రాముల గంజాయి లభించింది. సుకుమార్‌కు చెందిన బైక్‌లో స్నేహితులందరూ గుంటూరు వెళ్లగా తనకు వేరే పని ఉంది తర్వాత వస్తానంటూ సుకుమార్ అక్కడే ఆగిపోయాడు. నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా రత్తయ్య నుంచి తరచూ కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. సుకుమార్, రత్తయ్య పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ఆనంద్, సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ ఉమేష్, పక్కన ఎస్ఐ ఆనంద్